AKSHARA TODAY
అక్షర రటుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

విద్యుత్ సమస్య పరిష్కారం దిశగా చర్యలు






సరస్వతి దేవిగా అమ్మవారు..



పెద్దకొడప్‌గల్‌లో బతుకమ్మ సంబురాలు

అక్షరటుడే,పెద్దకొడప్‌గల్: మండల కేంద్రంలో నిర్వహించిన బతుకమ్మ సంబురాల్లో జుక్కల్ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు సౌదాగర్ అర్వింద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ పండుగ నిలుస్తోందన్నారు.




‘స్పెషల్’ బస్సుల పేరిట దోపిడీ..!

అక్షరటుడే, ఆర్మూర్ : పండగలు వచ్చాయంటే చాలు ప్రయాణికులను ఆర్టీసీ నిలువు దోపిడీ చేస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. అడ్డగోలుగా ఛార్జీలు వసూలు చేస్తూ ఇబ్బందుల పాల్జేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీలో రెగ్యులర్‌గా తిరిగే బస్సులకే ‘స్పెషల్’ అని స్టిక్కర్ వేసి ఇష్టారాజ్యంగా ఛార్జీలు దండుకుంటున్నారని ప్రయాణికులు తెలిపారు. ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులకు స్పెషల్ అంటూ స్టిక్కర్లు తగిలించి రెండింతలు డబ్బులు వసూలు చేస్తున్నారని వారు వాపోయారు. జేబీఎస్ నుంచి ఆర్మూర్‌కు రూ. 310 ఉండగా పండగ వేల ప్రత్యేక బస్సులు అంటూ రూ. 410 అదనంగా వసూలు చేస్తున్నారని. ఇలా ప్రతి బస్సుపై స్పెషల్ పేరుతో రూ.100 నుంచి రూ.200 వరకు అదనంగా వసూలు చేస్తున్నారన్నారు. మరోవైపు ఎక్స్ ప్రెస్ బస్సులకు స్పెషల్ బోర్డులు తగిలించారని పేర్కొన్నారు. ఈ బస్సులో మహాలక్ష్మి కార్డు చెల్లుబాటు కాకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని వారన్నారు. అసలు మహాలక్ష్మి టికెట్ తో ప్రయాణించడానికి బస్సు సర్వీసులే వేయకపోవడంతో మహిళా ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్సులో అధిక ధరలు వసూలు చేస్తున్నడంతో ప్రయాణికులు ఆర్టీసీ పై తీవ్ర ఆసనం వ్యక్తం చేస్తున్నారు.



మహిళల రక్షణ, భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

అక్షరటుడే, నిజామాబాద్ క్రైం: మహిళల రక్షణ, భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అదనపు డీసీపీ శుభమ్ ప్రకాష్ పేర్కొన్నారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో శుక్రవారం మహిళల భద్రత, రక్షణ, సంక్షేమానికి సంబంధించిన వివిధ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. షీటీమ్స్, భరోసా సెంటర్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్, గృహ హింస నిరోధక విభాగం, మహిళా సహాయ విభాగాలు, ఉమెన్ హెల్ప్ డెస్క్ తదితర విభాగాల పనితీరును సమీక్షించారు. ఆయా విభాగాలు అందిస్తున్న సేవలను తెలుసుకున్నారు. మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల అధికారులు సత్వరమే స్పందించాలని సూచించారు. బాధితులకు భరోసా కల్పిస్తూ వారికి న్యాయం జరిగేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో సీసీఆర్‌బీ ఏసీపీ గురునాయుడు, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ప్రసాద్, సీసీఎన్‌సీఐ సురేష్, షీటీం మహిళా ఎస్సై స్రవంతి సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.



సాగు రూటు మార్చాల్సిందే..

■ ఆరుతడి వైపు మొగ్గుచూపాల్సిన సమయమిదే.. ■ ఎల్‌నినో ముప్పు.. ఆరుతడి సాగే శ్రేయస్కరం!
■ పడిపోతున్న భూగర్భ జలాలు.. ■ వరికి పరిమితమైతే కష్టాలే..

ఎల్‌నినో ప్రభావంతో వర్షా లు సక్రమంగా పడలేదు. దీంతో వానాకాలంలో సాగు చేసిన పంటలకే నీరు అందక ఎండిపోతున్నాయి. ఈ క్రమంలో యాసంగి పంటల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. వరికి బదులుగా ఆరుతడి పంటలు వేయాలని అవగాహన కల్పిస్తున్నారు.
- అక్షరటుడే, భీమ్‌గల్

జిల్లాలో వరికోతలు ప్రారంభం అయ్యాయి. కొన్ని చోట్ల పంటలు ఈనిక దశలో ఉన్నాయి. అయితే సాగునీరు అందక పంటలు ఎండుతున్నాయి. కరెంట్ కోతలతో పొలాలు పారడం లేదు. మరికొన్ని చోట్ల అన్నదాతలు యాసంగి సాగుకు సిద్ధం అవుతున్నారు. ఈ క్రమంలో ఏ పంట సాగు చేయాలి? అందుబాటులో ఉన్న నీటిని ఎలా పొదుపుగా వినియోగించుకోవాలి? తక్కువ నీటితో, తక్కువ పెట్టుబడితో నష్టభయాన్ని తగ్గించుకుని ఆదాయం పొందే మార్గాలేమిటి? అనే అంశాలపై రైతులకు క్షేత్రస్థాయిలో స్పష్టమైన మార్గదర్శనం అత్యవసరమవుతోంది.

జిల్లాలో 5.44 లక్షల ఎకరాల్లో..

జిల్లాలో సాధారణంగా 5.44 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుండగా, మొక్కజొన్న 63 వేల ఎకరాలు, పసుపు 19 వేల ఎకరాల చొప్పున సాగవుతున్నాయి. జిల్లా వ్యవసాయ రంగంలో వరి ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ, వర్షాభావ పరిస్థితుల్లో కేవలం వరిపైనే ఆధారపడటం ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నీటి కొరత ఏర్పడి చివరి దశలో పంట ఎండిపోతే పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి రాని పరిస్థితి దాపురిస్తుంది. అందుకే వరి సాగును తగ్గించి ఆరుతడి పంటల వైపు మళ్లడమే రైతులకు ఏకైక రక్షణ మార్గమని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

భూగర్భజలాలు..

ఎల్‌నినో ప్రభావం వల్ల జిల్లాలో ఇప్పటికే వర్షాలు సరిగ్గా కురవక భూగర్భ జల మట్టం తీవ్రంగా పడిపోయింది. గతేడాది అక్టోబరులో 6 మీటర్లుగా ఉన్న జలమట్టం ఈ ఏడాది అక్టోబరు నాటికి ఏకంగా 10 నుంచి 11 మీటర్ల లోతుకు క్షీణించింది. రాబోయే రోజుల్లో విద్యుత్ సరఫరా కూడా నిరంతరాయంగా అయ్యే అవకాశం ఉండదు. నీటి కొరతతో పాటు విద్యుత్ సమస్య తలెత్తితే బోర్లపై ఆధారపడే వరి రైతులు తీవ్రంగా నష్టపోతారు.

వరికోతలు పూర్తవుతున్న వేళ..

వరి కోతలు కొన్నిచోట్ల పూర్తవుతుండగా.. మరికొన్ని చోట్ల ఇప్పటికే వడ్లు మార్కెట్‌కు వెళ్లిపోయాయి. ఈ నేపథ్యంలోనే గ్రామాల వారీగా నీటి లభ్యత, భూగర్భ జలాల పరిస్థితి, నేల స్వభావాన్ని బట్టి వ్యవసాయ శాఖ ముందస్తు ప్రణాళిక రూపొందించాల్సి ఉంది. ఆరుతడి పంటలకు అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచడం, పప్పుధాన్యాలు, నూనెగింజల పంటలకు స్థానికంగా కొనుగోలు సదుపాయాలు కల్పించడం అత్యవసరం.

4,30,000 ఎకరాల్లో వరి

జిల్లాలో ప్రస్తుతం 5,35,000 ఎకరాల్లో పంటలు సాగవుతుండగా, అందులో ఏకంగా 4,30,000 ఎకరాల్లో వరి పంటనే వేస్తున్నారు. కేవలం ఒక లక్ష ఎకరాల్లో మాత్రమే ఆరుతడి పంటలు సాగవుతున్నాయి. ఈ పరిస్థితి మారి ఆరుతడి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరగాలి. రైతులు ముమ్ముందు నష్టపోకుండా ఉండాలంటే తక్కువ నీటితో, తక్కువ కాలంలో పూర్తయి ఎక్కువ ఆదాయం తెచ్చే ఆరుతడి పంటలను ఎంచుకోవాలి. రైతులు ప్రధానంగా మొక్కజొన్న, జొన్న, సోయాబీన్, పొద్దుతిరుగుడు (సన్‌ఫ్లవర్), శనగలు, మిసుములు, నువ్వులు, ఇతర చిరుధాన్యాలను సాగు చేసుకోవాలి.

అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం..

ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు కురవక భూగర్భ జలాలు పడిపోతున్నందున రైతులు వరిని కాకుండా ఆరుతడి పంటలను ఎంచుకోవాలి. తక్కువ నీటితో, తక్కువ కాలంలో దిగుబడినిచ్చే పంటలు సాగు చేయడం వల్ల నష్టభయం తగ్గి మంచి లాభాలు వస్తాయి. శనివారం (రేపటి) నుంచి గ్రామాల్లో ఎల్‌నినో ప్రభావం, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తాం.

– వీరాస్వామి, జిల్లా వ్యవసాయ అధికారి



ఉత్తమ అగ్నిమాపక సిబ్బందికి పురస్కారాలు

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం అగ్నిమాపక శాఖలో ఉత్తమ సేవలందించిన వారిని గుర్తిస్తూ ఉత్తమ సేవా పతకాలు ప్రకటించింది. జిల్లా నుంచి 9మంది అధికారులు, సిబ్బంది ఈ సేవా పతకాలకు ఎంపికయ్యారు. తొమ్మిది మంది అధికారుల్లో ఏడుగురు అధికారులు ఇప్పటికే రిటైర్ అయ్యారు. ఇద్దరు ఉద్యోగులు ప్రస్తుతం లీడింగ్ ఫైర్ ఫైటర్లుగా విధుల్లో ఉన్నారు. లీడింగ్ ఫైర్ ఫైటర్లు అనంతరావు, ఎం. ప్రకాశ్ సేవా పతకాలు సాధించారు. రిటైర్డ్ ఉద్యోగులు ఎల్ గంగాధర్ (బోధన్), చంద్రగౌడ్, విఠల్, గంగారాం, మహ్మద్ ఉస్మాన్, సంజీవయ్య, గంగాదాస్ పతకాలు పొందిన వారిలో ఉన్నారు.

ఎల్లారెడ్డి వాసికి బిచ్కుంద బార్



అక్షరటుడే, కామారెడ్డి: బిచ్కుంద మున్సిపాలిటీలో కొత్తగా మంజూరైన బార్‌కు గతవారం రోజులుగా ఎక్సైజ్ శాఖ అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. సెలవు రోజులలో సైతం అవకాశం కల్పించారు. దాంతో 90 దరఖాస్తులు వచ్చాయి. శుక్రవారం బార్ కేటాయింపునకు లక్కీడ్రా నిర్వహించారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఈ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించినట్లు జిల్లా ఆబ్కారీ అధికారి బి.ముకుంద రెడ్డి తెలిపారు. బిచ్కుంద మున్సిపాలిటీలో నూతన బార్ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో ఈ బార్ కోసం మొత్తం 90దరఖాస్తులు వచ్చినట్లు ఆయన వెల్లడించారు. అర్హులైన అభ్యర్థులందరికీ టోకెన్లు కేటాయించి శుక్రవారం కలెక్టర్ సమక్షంలో లక్కీడ్రా తీశారు. ఈ లక్కీడ్రాలో టోకెన్ సంబర్-1 విజేతగా నిలువగా ఎల్లారెడ్డికి చెందిన భైరవ స్వామికి బార్ కేటాయించారు.



కామారెడ్డి రెడ్‌క్రాస్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

అక్షరటుడే, కామారెడ్డి : ఇటీవల నూతనంగా ఎన్నికైన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా మేనేజ్‌మెంట్ కమిటీ కొలువుదీరింది. కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ హాజరై కమిటీతో ప్రమాణస్వీకారం చేయించారు. ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లాలో అద్భుతమైన సేవలు అందిస్తోందని కొనియాడారు. నూతన కమిటీ కృషితో కామారెడ్డి జిల్లా బ్రాంచ్ రాష్ట్రంలోనే అత్యధిక మెంబర్ షిప్ నమోదు చేసి రెండో స్థానంలో నిలవడంపై హర్షం వ్యక్తం చేశారు. కామారెడ్డి జిల్లాలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటుకు విశేష కృషి చేయాలని నూతన కమిటీకి కలెక్టర్ సూచించారు. బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటుకు అవసరమైన ప్రభుత్వ స్థలాన్ని కేటాయించడంలో జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహకారం అందిస్తామని కీలక హామీ ఇచ్చారు. బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటు చేస్తే తనవంతు సహాయంగా రూ.5లక్షలు ఇస్తానని నూతన చైర్మన్ సంజీవరెడ్డి ప్రకటించారు. ఛైర్మన్‌తో పాటు, స్టేట్ ఎంసీ మెంబర్ డాక్టర్ ఎం. జైపాల్ రెడ్డి, వైస్ ఛైర్మన్‌గా దస్తిరామ్, ట్రెజరర్‌గా రమేష్ రెడ్డి, మాజీ ఛైర్మన్ రాజన్నతో పాటు డిస్ట్రిక్ట్ ఎంసీ మెంబర్స్‌గా నాగరాజు గౌడ్, కృష్ణ, గోవర్ధన్, సదాశివరెడ్డి, శ్రీధర్ జోషి, శ్రీకాంత్, దత్తాత్రి, కిరణ్ ప్రమాణ స్వీకారం చేశారు.

డివిజన్లలో పనులు నాణ్యతతో చేపట్టాలి : ధన్‌పాల్

అక్షరటుడే, ఇందూరు: నగరంలో ఆయా డివిజన్లలో జరుగుతున్న పనులను నాణ్యతతో చేపట్టాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని 23, 24, 6, 48వ డివిజన్లలో రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో ప్రతి డివిజన్‌కు రూ.20 లక్షలు కేటాయించారన్నారు. ఈ నిధులతో ప్రతి డివిజన్‌లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. ఇప్పటికే ఖిల్లా రామాలయ అభివృద్ధిలో భాగంగా రోప్‌వేకు సంబంధించిన డీపీఆర్ కూడా సిద్ధమవుతుందని చెప్పారు. ప్రధానంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిజామాబాద్ నియోజకవర్గానికి నిధులు విడుదల చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. గత మూడేళ్లుగా సీడీపీ నిధుల కోసం అనేక సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా లాభం లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో మేయర్ ఉమారాణి, కార్పొరేటర్లు, ప్రవంతిరెడ్డి, సుమిత్ర కిషోర్, విజయ మల్లేష్ యాదవ్, ప్రసన్న శ్యామల సత్యపాల్ తదితరులు పాల్గొన్నారు.





బార్ ఏర్పాటు కోసం కలెక్టరేట్‌లో లక్కీడ్రా

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: బోధన్ పట్టణంలో నూతనంగా మంజూరైన బార్ కోసం శుక్రవారం లక్కీడ్రా నిర్వహించారు. కలెక్టరేట్‌లో జిల్లా పాలనాధికారి ఇలా త్రిపాఠి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. బార్ లైసెన్సు కోసం మొత్తం 19 దరఖాస్తులు దాఖలయ్యాయి. ఈ సందర్భంగా దరఖాస్తుదారుల సమక్షంలో కలెక్టర్ లక్కీ డ్రా తీసి బార్ కేటాయింపు కోసం లైసెన్స్ ఖరారు చేశారు. లక్కీడ్రా కోసం వినియోగించిన టోకెన్లను అందరికీ చూపిస్తూ, పారదర్శకంగా డ్రా నిర్వహించారు. ఎలాంటి అనుమానాలకు ఆస్కారం లేకుండా లక్కీ డ్రా ప్రక్రియ ప్రారంభం నుంచి చివరి వరకు ఫొటో, వీడియో చిత్రీకరణ జరిపించారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీధర్, సూపరింటెండెంట్ నందగోపాల్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ గాయత్రి, బోధన్ ఎక్సైజ్ సీఐ భాస్కర్ తదితర అధికారులు లక్కీ డ్రా నిర్వహణ ప్రక్రియలో పాల్గొన్నారు.

కరెంటివ్వకుండా రైతులను ఇబ్బంది పెడుతున్నారు



అక్షరటుడే, పెద్దకొడప్‌గల్: కాంగ్రెస్ పాలనలో కరెంట్ కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే విమర్శించారు. పెద్దకొడప్‌గల్‌లో ఆయన మాట్లాడారు. కేసీఆర్ హయాంలో రైతులకు 24 గంటల నిరంతర విద్యుత్ అందిందని గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యుత్ కోతలు పెరిగి, పంటలు ఎండిపోయే దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వం వెంటనే నాణ్యమైన విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సరఫరాలో నిర్లక్ష్యం వీడకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి పెద్దఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. పంటలు ఎండిపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ ప్రతాప్ రెడ్డి, సొసైటీ చైర్మన్ హన్మంత్ రెడ్డి, నాయకులు బన్సీలాల్, చందా నాయక్, అంబరెడ్డి, సాయిరెడ్డి, జానీ పటేల్, సంజీవ, నందు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరసన



అక్షరటుడే, కామారెడ్డి: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం నాలుగో రోజుకు చేరింది. నాలుగు రోజులుగా కామారెడ్డి కలెక్టరేట్ సమీపంలోని ధర్నాచౌక్ వద్ద ఆందోళన బాట పట్టారు. అంతకుముందు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ముందు రెండు గంటల పాటు ఆందోళన చేపట్టారు. అక్కడినుంచి ర్యాలీగా కలెక్టరేట్ వరకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. జిల్లాలో 539 మంది ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు నాలుగు రోజులుగా విధులను బహిష్కరించి సమ్మెలో పాల్గొంటున్నామన్నారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి సుమన్, గౌరవాధ్యక్షుడు మారుతి, ప్రధాన కార్యదర్శి పద్మజ, ఉపాధ్యక్షుడు వెంకటరమణ, జేఏసీ నాయకులు వేణు, మనోజ్, సాధన, మీనాక్షి, రవళి, రాహుల్, చంద్రకాంత్, అంకుశ్, సందీప్, అఖిల్, విజయ్, శ్యాం పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన



అక్షరటుడే, భిక్కనూరు: పట్టణంలో దసరా ఉత్సవాలను పురస్కరించుకుని చేపడుతున్న ఏర్పాట్లను సర్పంచ్ బల్యాల రేఖ సుదర్శన్ వార్డు సభ్యులతో కలిసి పరిశీలించారు. పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించి వాటిపై సభ్యులతో చర్చించారు. దసరా ఉత్సవాల్లో గ్రామ ప్రజలందరూ ఉత్సాహంగా పాల్గొనేలా ఏర్పాట్లు ఉండాలని వేడుకలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా అందరూ సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. పండుగ వేడుకలు గ్రామ ప్రజల మధ్య ఐక్యతకు, సాంప్రదాయాల పరిరక్షణకు ప్రతీకగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు సురేష్ గౌడ్, వేణు, రాజు, పంచాక్షరి, చంద్రం, రాంచంద్రం, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తితగాదాలతో మనస్తాపానికి గురై ఒకరి ఆత్మహత్య




అక్షరటుడే, భీమ్‌గల్: కుటుంబంలో తలెత్తిన ఆస్తి తగాదాల కారణంగా మనస్తాపానికి గురై ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన భీమ్‌గల్ పట్టణంలోని బాపూజీనగర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. కోరుట్ల మండలానికి చెందిన షేక్ రహీం (35) 15 ఏళ్లుగా భీమ్‌గల్‌లోని బాపూజీనగర్‌లో నివాసముంటున్నాడు. ఇతనికి భార్య షహీనా, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కాగా, కోరుట్లలో నివసిస్తున్న అతని తల్లి, చెల్లెలుకు అక్కడ ఉన్న ఇల్లు అమ్మే విషయమై రహీంతో కొంతకాలంగా వివాదాలు నడుస్తున్నాయి. ఈ విషయమై మాట్లాడేందుకు రెండు రోజుల క్రితం కోరుట్ల వెళ్లొచ్చిన రహీం తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. శుక్రవారం ఉదయం భార్య పనిమీద బయటకు వెళ్లగా, పిల్లలు బయట ఉండగా ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య షహీనా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.


గాయత్రి నగర్‌లో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు..


అయోధ్య నగర్ కాలనీ రామ మందిరం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో..

సరస్వతీ దేవిగా అమ్మవారి దర్శనం..


గాజుల్‌పేట్‌లో అంబే భవానీ కమిటీ ఆధ్వర్యంలో..

శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆయా మండపాల వద్ద సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. పెద్ద ఎత్తున మహిళలు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.
– అక్షరటుడే, నెట్‌వర్క్


రూ.2 కోట్ల 11 లక్షల తో దుర్గామాత అలంకరణ




గాయత్రి నగర్‌లో శ్రీ ఆంజనేయ యూత్ ఆధ్వర్యంలో..


సాయి ప్రియ నగర్ కాలనీలో లెవెన్ స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..


రోటరీ నగర్ ఫేస్ 3 లో..


గాయత్రి నగర్‌లో చింతచెట్టు మైసమ్మ దేవి భక్త సేవాసమితి ఆధ్వర్యంలో..


ఆర్మూర్ పవర్ యూత్ ఆధ్వర్యంలో..


బాల్కొండ మండల కేంద్రంలో..


ఆర్మూర్ లో కుంకుమార్చన..


డిచ్ పల్లి బెటాలియన్ లో..

తహశీల్దార్ కార్యాలయం తరలింపుపై సందిగ్ధం



అక్షరటుడే, కామారెడ్డి: కామారెడ్డి తహశీల్ కార్యాలయం తరలింపు వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం కొనసాగుతున్న భవనంలోనే న్యాయస్థానానికి చెందిన రెండు కొత్త బెంచ్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించడంతో తహశీల్ కార్యాలయాన్ని ఖాళీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో ఈ భవనంలోనే న్యాయస్థానం కొనసాగేది. తర్వాత కోర్టు కొత్త భవన సముదాయంలోకి మారింది. ఇప్పుడు అదనంగా మరో రెండు బెంచ్‌లు మంజూరు కావడంతో స్థలాభావం ఏర్పడింది. దీంతో పాత భవనంలోనే కొత్త బెంచ్‌లు ఏర్పాటు చేయాలని న్యాయశాఖ నిర్ణయించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో తహశీల్దార్ కార్యాలయాన్ని మరోచోటికి మార్చాలని జిల్లా యంత్రాంగం భావిస్తోంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని జీపీఎస్ కళాశాల భవనంలోకి తహశీల్ కార్యాలయాన్ని తరలించే యోచనలో ఉన్నట్లు సమాచారం. దానితో పాటు ఇతర భవనాలను సైతం అధికారులు పరిశీలిస్తున్నారు. కార్యాలయాన్ని ఈనెల 25లోపు షిఫ్ట్ చేయాలని ఆదేశాలు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే రెవెన్యూ రికార్డుల భద్రత, రిజిస్ట్రేషన్ల నిర్వహణ, ఆన్‌లైన్ నెట్‌వర్క్, మౌలిక వసతుల కల్పనపై రెవెన్యూ అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. హడావుడిగా మారిస్తే ప్రజలకు ఇబ్బందులు తప్పవని భావించి మూడు నెలల గడువు కోరినట్లు సమాచారం. మరోవైపు తహశీల్దార్, ఆర్డీవో కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ప్రస్తుత భవనం వద్ద అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

అక్షరటుడే, మాక్లూర్: మామిడిపల్లి, చిన్నాపూర్ గ్రామాల్లో శుక్రవారం సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. కాంగ్రెస్ నాయకులు గంగాధర్ గౌడ్, దయాకర్ రావు ఆధ్వర్యంలో సర్పంచ్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. లబ్ధిదారులు దాసరి లక్ష్మికి రూ.43,000, ప్రియ రూ.19,000, హన్మాండ్లు రూ.24,000, జనార్దన్ రూ.19,000 చొప్పున చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు సీఎం రేవంత్‌రెడ్డి, వినయ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చిన్నా, లత నాయకులు పాల్గొన్నారు.




ఉద్యమకారుల కోసం వెబ్‌సైట్ ఏర్పాటు అభినందనీయం



అక్షరటుడే, డిచ్‌పల్లి: ఉద్యమకారుల సంక్షేమం కోసం, వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ప్రభుత్వం వెబ్‌సైట్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ఉద్యమకారుల జేఏసీ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెయూ క్యాంపస్ ఆవరణలో సంబరాలు నిర్వహించారు. ఉద్యమకారుల జేఏసీ నాయకులు పుప్పాల రవి, పస్క నర్సయ్య ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్యే భూపతిరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో ఏళ్లపాటు ఉద్యమకారులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాటం చేశారన్నారు. ఉద్యమకారుల త్యాగాలను గుర్తించి, వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు వెబ్‌సైట్ ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులకు తగిన గుర్తింపు, గౌరవం, సంక్షేమ ఫలాలు అందించేందుకు ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యుత్ సమస్య పరిష్కారం దిశగా చర్యలు



అక్షరటుడే, పెద్దకొడప్‌గల్: మండలంలో విద్యుత్ సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అన్నారు. కాటేపల్లి గ్రామంలో 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు ఏలె మల్లికార్జున్‌తో కలిసి భూమిపూజ చేశారు. పెద్దకొడప్‌గల్ మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో ఎదురవుతున్న అంతరాయాలను తగ్గించి, ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందించాలనే లక్ష్యంతో కాటేపల్లిలో నూతన సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నూతన సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే విద్యుత్ సరఫరా వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు రైతులకు వ్యవసాయ, రోజువారీ గృహావసరాల కోసం మెరుగైన విద్యుత్ సేవలు అందే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దకొడప్‌గల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలను సబ్సిడీతో ఇవ్వాలి



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: పంట మార్పిడి కోసం ఆరుతడి పంటల విత్తనాలను సబ్సిడీతో అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం ఉండబోతుందని యాసంగి పరి సాగును వేయొద్దని చెబుతున్న సీఎం రేవంత్ రెడ్డి ఆరుతడి సాగుకు విత్తనాలు కూడా ఇప్పించే బాధ్యత తీసుకోవాలన్నారు. మక్క, జొన్న, నువ్వులు, పొద్దుతిరుగు పువ్వు, కుసుమ, పప్పు దినుసుల విత్తనాలను సబ్సిడీతో అందించాలని కోరారు.



45వ డివిజన్‌లో మున్సిపల్ సిబ్బందికి దుస్తుల అందజేత

అక్షరటుడే, ఇందూరు: నగరంలోని 45వ డివిజన్‌లో మున్సిపల్ సిబ్బందికి కార్పొరేటర్ బొబ్బిలి సువర్ణ వేణుగోపాల్ దుస్తుల అందజేశారు. విజయదశమి సందర్భంగా డివిజన్‌లో విధుల్లో ఉన్న మున్సిపల్ సిబ్బందికి దుస్తుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పండుగ నేపథ్యంలో కార్మికులకు తమవంతుగా దుస్తులను అందజేశామన్నారు. కార్యక్రమంలో పలువురు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.



ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు చర్యలు

అక్షరటుడే, ముప్కాల్: మండలంలోని నల్లూరు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గ్రామంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమాలు, వివాహాలు, పుట్టినరోజులు, ఇతర శుభకార్యాల్లో వినియోగించేందుకు స్టీల్ ప్లేట్లను సమకూర్చారు. ప్లాస్టిక్ ప్లేట్ల వినియోగాన్ని తగ్గించడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని నియంత్రించవచ్చని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. ఎంపీడీవో బి.రమేష్, సర్పంచ్ బర్కం గంగాధర్, వార్డు సభ్యులు ప్రవీణ్ కుమార్, రాజు, పంచాయతీ కార్యదర్శి విఘ్నేష్, దుర్గభవాని సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఆరుతడి పంటలు వేయాలి



అక్షరటుడే, ఆర్మూర్: రబీ సీజన్‌లో పరిపంటకు బదులుగా ఆరుతడి పంటలు వేసుకోవాలని ఆర్మూర్ వ్యవసాయ శాఖ అధికారి హరికృష్ణ తెలిపారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా బోర్లలో భూగర్భజలాలు వేగంగా తగ్గుతున్నాయన్నారు. బోర్లలో నీరు అందుబాటులో ఉన్నప్పటికీ, రాబోయే రోజుల్లో సాగుకు అవసరమైన విద్యుత్, నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. తెల్ల జొన్నలు, ఎర్ర జొన్నలు ముందస్తుగా కొనుగోలు ఒప్పందం చేసుకొని సాగు చేయడం మంచిదన్నారు. అదేవిధంగా నువ్వులు, పొద్దుతిరుగుడు, కుసుమ (సన్‌ఫ్లవర్), మొక్కజొన్న, పెసర, మినుములు ఇతర పంటలు వేయాలని కోరారు.